ప్రజాశక్తి

ఆదివారం 15 జూన్ 2025   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షపార్టీల నేతలు

17న పాలస్తీనా

సంఘీభావ దినం జయప్రదం చేయాలి

వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

గాజాలోని పాలస్తీనాపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను ఖండిస్తూ ఈనెల 17న పాలస్తీనా సంఘీభావ దినంగా పాటించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపు నిచ్చారు. ఒంగోలు సుందరయ్య భవనంలో వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ,సిపిఐ ఎంఎల్ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతల సమావేశం శనివారం నిర్వహించారు. పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిస్తూ ఈనెల 17న సాయంత్రం 5 గంట లకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించాలని, పట్టణాలు, మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 20 నెలలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలు మరణించారన్నారు. అందులో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ టార్గెట్ చేసుకుని ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అత్యంత పాశవికంగా చేస్తున్న దాడులను వారు తీవ్రంగా ఖండించారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతక వైఖరిని అవలంబిస్తూ పాలస్తీనా ప్రయోజనాలకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలని హితవు పలికారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపి వేయాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండ, వివక్ష, ఆక్రమణలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలలో భాగంగా ▶ 2లో

పొదిలి రాళ్లదాడి ఘటనలో..

మరో 15 మంది అరెస్టు

- అరెస్టు అయిన వారితో మాట్లాడేందుకు అనుమతి కోరిన వైసిపి నాయకులు
- అంగీకరించని సిఐ
- పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం
- కొద్దిసేపు ఉద్రిక్తత



పోలీసులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

పొగాకు రైతుల సమస్యలను తెలుసకొనేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వచ్చిన సమయంలో చోటు చేసుకున్న రాళ్ల దాడి ఘటనకు సంబంధించి పోలీసులు శనివారం మరో 15 మందిని అరెస్టు చేశారు. 9 మందిని కోర్టులో హాజరు పరిచారు. ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. వైసిపి కార్యకర్తల అరెస్టు గురించి తెలుసుకున్న వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, కుందూరు నాగార్జున రెడ్డి, ఉడుముల శ్రీనివాస్ రెడ్డి, వైసిపి నాయకులు పోలీస్ స్టేషన్‌వద్దకు వచ్చారు. స్టేషన్ బెయిల్ ఇచ్చిన ▶ 2లో

తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదు : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు



తప్పు చేస్తే ఎవరికైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి మాట్లాడారు. రైతులకు పరామర్శ పేరుతో వైసిపి రౌడీలను తీసుకొచ్చి నిరసన తెలుపుతున్న మహిళలపై దాడి చేయించింది జగనేనని తెలిపారు. వైసిపి గూండాల దాడిలో మహిళలకు, పోలీసులకు గాయాలైనట్లు తెలిపారు. ఈ ఘటనపై జగన్ కనీసం సానుభూతి తెలపకపోగా దొంగే దొంగ అన్నట్టుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాళ్ళ, చెప్పులతో వైసిపి గుండాలు దాడులు చేస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా అని మంత్రి ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరికైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని తెలిపారు. తాము ప్రజా స్వామ్యహితంగా వ్యవహరిస్తున్నాం కాబట్టే జగన్ స్వేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నట్లు ఆయన తెలిపారు. గత 5 ఏళ్ల వైసిపి అరాచక పాలనను జగన్ గుర్తు తెచ్చుకోవాలన్నారు.

పొదిలి రాళ్లదాడి ఘటనలో మరో 15 మంది అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

వారితో తాను మాట్లాడేందుకు అనుమతించాలంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సిఐ వెంకటేశ్వర్లును కోరారు. అందుకు ఆయన అనుమతించలేదు. దొంగలతో మాట్లాడేది ఏంటి అంటూ సిఐ వ్యాఖ్యానించాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అరెస్ట్ అయిన వారు దొంగలు ఎలా అవుతారంటూ అధికారి హోదా ఉండి జాగ్రత్తగా మాట్లాడాలని చెవిరెడ్డి వాదించారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అనంతరం పోలీసులు 9 మందిని పొదిలి కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు. వైసిపి నాయకులు కూడా పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి పోలీసుల అరెస్టు చేసిన కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం వైసిపి నాయకులు మాట్లాడుతూ పోలీసులు ఏపక్షంగా వ్యవహరిస్తూ తమ కార్యకర్తలు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. 15 మందిని అరెస్టు చేసి ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు. మిగతా వారికి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. అరెస్టు చేసిన అందిరి పట్ల ఒకే రకంగా వ్యహరించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పొదిలి ఘటన రాష్ట్రంలోనే సంచలనం సృష్టిస్తోంది. అరెస్టుల పర్వం ఇంకా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

17న పాలస్తీనా.. సంఘీభావ దినం జయప్రదం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కేంద్రమైన ఒంగోలులో నిరసన కార్యక్రమం జరపాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని, మానవతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు , సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎంఎస్.సాయి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడుఆర్. మోహన్,సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, సిపిఐ నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ నాయకులు పరిటాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోళ్లను పరిశీలిస్తున్న కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సెక్రటరీ కేశంగ్

పొగాకు సాగును తగ్గించుకోవాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట సమీపంలోగల ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను శనివారం నాడు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ కేశంగ్ మాంగ్జామ్ షేర్ప, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్, పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ, బోర్డు సెక్రెటరీ వేణుగోపాల్ తదితరులు పరిశీలించారు. రైతులు రాబోయే ఏడాది పొగాకు సాగును తగ్గించుకోవాలని కేంద్ర జాయింట్ సెక్రెటరీ కేశంగ్ వెల్లడించారు. పొగాకు బోర్డు టార్గెట్ మేరకే ప్రకాశం రైతులు పొగాకును ఉత్పత్తి చేయాలని ఆమె కోరారు. అధికంగా పొగాకును సాగు చేసి రైతులు నష్టపోవద్దని ఆమె సూచించారు. వేలం నిర్వహణ అధికారి ఎం రవికాంత్ పర్యవేక్షించారు. చిలకపాడు కస్టర్ పరిధిలో 1135 పొగాకుబేళ్లను వేలానికి తీసుకురాగా వీటిలో 888 పొగాకు బేళ్లకు విక్రయాలు జరిగాయి. వివిధ కారణాలతో 247 పొగాకు బేళ్లను తిరస్కరించారు. పొగాకు కిలో ఒక్కింటికి అత్యధిక ధర రూ.280 ధర పలుకగా అత్యల్ప ధర రూ.180 రూపాయలు పలికింది. కిలో సరాసరి ధర రూ.251.55 లభించాయి. వేలం కేంద్రంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు 1, 2 వేలం కేంద్రాల అధ్యక్షులు ఎస్ గురువారెడ్డి, వి ప్రసాద్, రైతు నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణ రావు, ఆర్ సుబ్బారావు, ఎన్ మస్తాన్‌రెడ్డి, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, పొగాకు బయర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేద్దాం

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి మార్కాపురం

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 26 కుటుంబాలు బలి అయ్యాయని, మతంతో సంబంధం లేకుండా పిచ్చోడి చేతిలో రాయిలా ఉగ్రవాదులు వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాద భావజాలానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రజల్లో ప్రచారం నిర్వహించడం, ప్రజల కొనుగోలు శక్తి పెంచడం, ప్రజల సమస్యలు సరైన మార్గంలో పరిష్కారం చేయడమే ఉగ్రవాదానికి సరైన మందు అని అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సమైక్యత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మాజీ జిల్లా కార్యదర్శి పి ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. ఉగ్రవాదానికి మతం, కులం, ప్రాంతంతో సంబంధం లేదన్నారు. అణచివేయబడిన వారిపై తిరుగుబాటు చేయడం ఉగ్రవాదుల పనిగా మారిందన్నారు. పాకిస్తాన్లో మెజారిటీ మత ఉన్మాదం ఆ దేశ, అదే మతానికి సంబంధించిన అధ్యక్షులను సైతం హతమార్చిన సందర్భాలు ఉన్నాయని, అందుకు బెనజీర్ భుట్టో హత్య నిదర్శనమని అన్నారు. జమ్మూ కాశ్మీర్లో పర్యాటక రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రజ లు సుఖంగా జీవన ప్రమాణాలతో జీవించడం ఉగ్రవాదులకు నచ్చదని అన్నారు. పహల్గా ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సింధూర్ నిర్వహణలో భారత దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం వాటిల్లేలాగా అమెరికా జోక్యం చేసుకొని యుద్ధ విరమణను ప్రపంచానికి వెల్లడించడం భారతదేశ స్వతంత్రతను, సార్వభౌమత్వాన్ని చిన్నచూపు చూడటమే అవుతుంది అన్నారు. ప్రస్తుతం దేశంలో ఒక వర్గాన్ని టార్గెట్ చేసుకొని పెద్దఎత్తున విష ప్రచారం జరుగుతోందని అన్నారు. కులమత భావాలకతీతంగా అన్ని తరగతుల ప్రజలు ఐక్యంగా జీవించినప్పుడే సమాజం అభివృద్ధి అవుతుందని, భిన్నత్వంలో ఏకత్వం పరిఢవిల్లుతుంది అని అన్నారు. ఏపీ సివిల్ రైట్స్ ప్రొటెక్షన్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు మాట్లాడారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే దేశం అన్ని రంగాల్లో సర్వతోముఖ అభివృద్ధి చెందినప్పుడు మాత్రమే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

సాంఘిక సంక్షేమ గురుకులాల డిసిఒ జయ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రకాశం జిల్లాకు రాష్ట్రం లోనే ప్రథమ స్థానం దక్కినట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాలోని 11 డాక్టర్ అంబేద్కర్ గురుకులాల్లో ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు మొత్తం 557 మంది హాజరు కాగా అందులో 515 మంది (95శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 42 మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు. గత నెలలో నిర్వహించిన అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో మిగిలిన 42 మంది కూడా ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోని 190 గురుకులాల్లో మెదటి స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గురుకులాల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్షలు రాసిన వారికి ర్యాంకుల ప్రకారం మొదటి విడతలో సీట్లు పొందిన 816 మందికి గాను 585 మంది తమ సీట్లు ఖరారు చేసుకున్నట్లు తెలిపారు. 238 మంది పాఠశాలల మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సెకండ్ పేజ్ లో మరో 378 కు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. అందులో 99 మంది సీట్లు ఖరారు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో 166 పాఠశాలల్లో చేరేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిపారు. ర్యాంకులు పొందిన వారికి ఫోను ద్వారా సమాచారం అందజేశామన్నారు. 10 రోజులోపు మిగిలిన వారు కూడా తమ సీట్ల ఖరారు చేసుకువాలని సూచించారు. ఇంటర్ మీడియట్ ప్రవేశం కోసం, ఎంట్రెన్స్ పరీక్ష రాసిన వారిలో జిల్లా లో మెదటి విడత లో 744 సీట్లుకు 338 సీట్లు ఖరారు చేసినట్లు తెలిపారు. 396 మందిలో 223 మంది కాలేజీల్లో చేరేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిపారు.40 మంది కళాశాలల మార్పుకోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. మరో 39 మంది సీట్లు వదులుకున్నటు ఆమ్లె పేర్కొన్నారు. 60 మందికి ఫోను చేసినా స్పందించడం లేదన్నారు. 25 మంది విద్యార్థులు ఇతర ప్రైవేట్ కళాశాలలలో చేరినట్లుగా తెలిపారని ఆమె పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో సీట్లు పొందిన విద్యార్థులు 10 రోజుల్లోపు ఆయా కళాశాలలకు సీటు ఖరారు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు, కొనసాగుతున్న కాంట్రాక్ట్ టీచర్ల పోస్టుల భర్తీ కి ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా గెస్ట్ టీచర్లను నియమించనున్నట్లు డిసిఒ తెలిపారు.

గిద్దలూరు మండలానికి 76 స్పౌజ్ పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలానికి 76 స్పౌజ్ పింఛన్లు మంజూరయినట్లు గిద్దలూరు ఎంపిడిఓ డివి రమణారెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయాల వారీగా అంబవరం 5, గడికోట 3, కంచిపల్లి 2, కొమ్మునూరు 2, కొత్తకోట 3, కృష్ణంశెట్టిపల్లి 1లో 8, కృష్ణంశెట్టిపల్లి 2లో 6, ముండ్లపాడు1లో 7, ముండ్లపాడు 2లో 8, నరవ 5, ఓబులాపురం1, పొదలకొండపల్లి 8,తిమ్మాపురం 5, ఉయ్యాలవాడ 6, వెల్లుపల్లి 4, తంబళ్లపల్లి 3 మంజూరయ్యాయని, అందుకు సంబంధించి నిధులు రాగానే, ప్రభుత్వ ఆదేశాను ప్రకారం త్వరలో వారికి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపిడిఒ తెలిపారు.



పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి భారతి

ఆర్థిక స్థోమత లేని వారికి... ఉచిత న్యాయ సహాయం చేస్తాం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన జడ్జి ఎ భారతి శనివారం సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించారు. శుభ్రతపై ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న ఖైదీలతో మాట్లాడారు. జైలులో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీలందరూ పరివర్తన చెందాలన్నారు. సమాజంలో గౌరవంగా జీవనం సాగించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మీ తరపున వాదించేందుకు న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆమె వెంట మార్కాపురంలోని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం శుభవాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం బాలాజీ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎస్ ఇబ్రహీంషరీఫ్, ప్యానల్ లాయర్ ఆకుల ఉషశ్రీ, లీగల్ వాలంటీర్ షేక్ బాషా, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూచేపల్లికి నోటీసు అందజేత

ప్రజాశక్తి-దర్శి

ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పోలీసులు నోటీసు అందజేశారు. ఈనెల 11న జగన్ పర్యటన సందర్భంగా పొదిలిలో రాళ్ల దాడి సంఘటనలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని పోలీసులు నోటీసులు ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేది పోలీసులని, తమకు ఎలాంటి సంబంధం లేకపోయినా నోటీసులు ఇచ్చారని, పోలీసులకు సహకరిస్తామన్నారు. న్యాయపరంగా వెళ్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

శాస్త్రీయ సమాజ స్థాపనే లక్ష్యం: జెవివి

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి పట్టణంలోని సాయి సిద్దార్థ హాస్పిటల్‌లో శనివారం సాయంత్రం డాక్టర్ మర్రి ధనుంజయుడు జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, మేధావులు జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వి.మాలకొండారెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించడం కోసం జెవివి గత 37 సంవత్సరాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు జి.శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాజా హుస్సేన్, వెలిగండ్ల మండల కార్యదర్శి మేడం కోటి రెడ్డి, కలాం కాలేజి షరీఫ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి: విద్యానగర్‌కు చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలిక జంజనం హర్షినికి చీమకుర్తి పద్మశాలి సేవా సంఘం మరియు పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.1,50,000 ఆర్థిక సాయం అందజేశారు. శనివారం గుంటూరులోని క్యాన్సర్ హాస్పిటల్‌లో జంజనం హర్షినికి నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలి సంఘం నాయకులు కన్నా మాస్టర్, కస్తూరి వెంకటేశ్వర్లు, యువసేన ప్రతినిధులు పెనుగొండ శ్రీనివాసరావు, గోలి వంశీకృష్ణ, మునగపాటి రమేష్, గోపవరపు పూర్ణచంద్రరావు, గుద్దండి శ్రీనివాసరావు, లక్ష్మీ కోటి, కోట కిషోర్, బండి మహేష్ పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలింపుపై ఆందోళన

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

మండలంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం చెరువు నుంచి మట్టిని తరలించడంపై కోవిలంపాడు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ అధికారులను, తమ పంచాయతీలోని నాయకులను లోపర్చుకొని మట్టిని తరలిస్తున్నారని చెప్తున్నారు. శీలంవారిపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డును కూడా పాడుచేసి మట్టిని తరలించినట్లు వారు తెలియజేస్తున్నారు. చెరువులో మట్టిని తరలించడంపై తమ పంచాయతీకి చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి పిడుగు బాబురావు అభ్యంతరం తెలపడంతో కొద్ది రోజులు ఆపివేశారని తిరిగి మళ్లీ మట్టిని తరలిస్తున్నట్లు వారు తెలియజేస్తున్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.రాజశేఖర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ సూపర్ సిక్స్ అమలులో భాగంగా నిరుద్యోగులకు, యువజనలకు ఇచ్చిన నిరుద్యోగ భృతి పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం నాడు ఒంగోలు మాదాల నారాయణస్వామి భవనంలో జరిగిన సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. సమావేశంలో పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి సిహెచ్ శ్యామ్, జిల్లా నాయకులు వి.కోటి, వెంకట్రావు, సచిన్, ప్రేమ్ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

44 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు, మూడు ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, బాపట్ల జిల్లాల అసిస్టెంట్ కమీషనర్ శ్రీదయాసాగర్ ఆదేశాల మేరకు ఎఇఎస్ జనార్దన్ నేతృత్వంలో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ శనివారం జరిపిన మెరుపు దాడుల్లో రవాణాకు సిద్ధంగా ఉన్న 44 కిలోల గంజాయిని ఓంగోలులోని అద్దంకి బస్టాండ్ సమీపంలో స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నంకు చెందిన వడిసెల మోహనరావు, నెత్తెట్టి అప్పలరాజు అనే ఇద్దరు గంజాయి రవాణాదారులను అరెస్టు చేసినట్టు ఒంగోల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐలు రావిపాటి నరహరి రావు, సోమిశెట్టి రామారావులు ప్రకటించారు. మోహనరావును గతంలో విజయవాడ రైల్వే పోలీస్‌లు అరెస్ట్ చేసి 20 కిలోల గంజాయిని సీజ్ చేసి రాజమండ్రి జైలుకు తరలించినట్లు సమాచారం. నిందితులు ఇద్దరు శుక్రవారం విశాఖపట్నంలో ఆరిలోవ లోన్-16 వద్ద ఆనంద్ అనే వ్యక్తి దగ్గర కేజీ గంజాయి 4 వేల రూపాయిలకు కొనుగోలు చేసి తమిళనాడులోని సేలంలో భూపతి, అండి స్వామి అనే ఇద్దరు వ్యక్తులకు కేజీ 7 వేల రూపాయిలకు అమ్మడానికి తీసుకెళుతున్నట్లు విచారణలో వెల్లడియిందన్నారు. మిగిలిన నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు డి.మౌలాలి, పి.రాజేంద్ర ప్రసాద్, హెచ్‌సి వెంకటరావు, ఈసీలు శ్రీనివాసరావు, ఇంటూరి కొండలరావు, కెవి రామిరెడ్డి, బాలసుబ్బయ్య, హర్షవర్దన్, నాగరాజు, జయసూర్య. డ్రైవర్ బ్రహ్మం పాల్గొన్నారు. ఇటీవలకాలంలో జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి. ఒంగోలు, బాపట్ల జిల్లాల డిసి హేమంత్ నాగరాజు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మార్కాపురం జిల్లాపై ప్రధాన అంశాలు కోరిన సిఎం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరిక మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ప్రధాన అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలతో ప్రకాశం జిల్లా ఏర్పడినదని, అధిక శాతం ప్రజలు వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులపై జీవిస్తున్నారని సదుపాయాలు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ మాగుంట తెలిపారు. ఈ నేపథ్యంలో మార్కాపురాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన సిఎం చంద్రబాబు నాయుడును ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి 2024లోనే కోరారు. పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం రుతుపవనాలకు దూరమై, వర్షాలు తక్కువై అన్ని రంగాలలో ఇంకా వెనుకబడే ఉందన్నారు. 11,650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోనూ- ఇటు 14,23,147 మంది జనాభాలోను రాష్ట్రంలోనే అతి పెద్ద జిల్లాగా ఉందన్నారు. దీంతో పరిపాలనా సౌలభ్యం కోల్పోయిందన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు మార్కాపురం చాలా దూరంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్కాపురం చుట్టూ వున్న గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి ప్రజల ఆచారాలు, అలవాట్లు, ఆహార వ్యవహారాలు ఒకటిగా ఉన్నాయన్నారు. జిల్లాకు కాల్సిన వసతులు వన రులు ఉండటంతో ప్రత్యేక మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు ఆవశ్యకత ఉందని ఎంపీ మాగుంట సూచించారు. గత ఎన్నికలలో ముఖ్యమంత్రి మార్కాపురం ఏరియా ప్రజల చిరకాల కోరిక ప్రకారం కొత్త జిల్లా ఏర్పా టుకు హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కొత్త జిల్లా ఏర్పాటుపై మార్కాపురం ప్రాంత ప్రజల కోరికలు నిర్దిష్ట సిఫార్సులు ప్రభుత్వానికి పంపాలని ప్రకాశం కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మార్కాపురం సబ్ కలెక్టర్‌కు పూర్తి స్థాయి నివేదిక పంపాలని సూచించారు.

కవులు, కళాకారుల జీవితం అజరామరం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కవులు, కళాకారులు సాహిత్యం, కళారూపాల ద్వారా వారి జీవితాలను ధన్యం చేసుకున్నారని రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ తెలిపారు. ప్రతి నెల రెండవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన 96వ నెల కార్యక్రమానికి అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత నటరాజ స్వామి విగ్రహానికి పూజ చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో బేబీ బృందం మువ్వ నాగేశ్వరరావు, చక్రాల మల్లికార్జునరావు, మిలటరీ కోటేశ్వరరావు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో ఈ నెలలో మరణించిన కవులు, కళాకారులపై ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి శ్రీశ్రీ పై జాల్ది విద్యాధరరావు, డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు, డాక్టర్ మండవ నరసింహారావుపై ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు ప్రసంగించారు. గుర్రం జాషువాపై గంగవరపు సునీత, కందుకూరి వీరేశలింగం పంతులుపై ఉన్నం జ్యోతి వాసు, గురజాడ అప్పారావుపై మాదేపల్లి సూర్య కుమారి, మల్లవరపు జాన్‌పై దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, కొలకలూరి స్వరూప రాణిపై కొలకలూరి చక్రవర్తి, బలిజేపల్లి లక్ష్మీకాంతంపై చిట్టా శివప్రసాద్, నాగినేని నరసింహారావుపై మిడసల మల్లికార్జునరావు, ఓగిరాల ఆదిమూర్తి, గాండ్ల వెంకటరావుపై అంగలకుర్తి ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు, రంగభూమి కళాకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగలకుర్తి ప్రసాద్

పామూరులో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణంలో ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టారు. గత పది రోజుల నుంచి అధికారులు, పోలీసులు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని ఆటో ద్వారా ప్రచారం చేశారు. గడువు ముగించడంతో శనివారం కార్యదర్శి, సిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ హైస్కూల్ నుంచి కనిగిరి రోడ్డు వరకు ఉన్న ఆక్రములను యంత్రాల ద్వారా తొలగించారు. ప్రభుత్వ ఆస్తులపై ప్రైవేటు వారికి ఎలాంటి హక్కు లేదని, బాడుగలికిచే హక్కు లేదని అధికారులు హెచ్చరించారు. రోడ్లు విస్తరణ చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కువ మంది వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

రైలు కిందపడి ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వే స్టేషన్లో రైలు కిందపడి మహిళా ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పంట రాధా (32) అనే ఉపాధ్యాయురాలు కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంటలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తోంది. గుడ్లూరు మండలం సీతారాంపురానికి చెందిన ఈమె భర్త కూడా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగాలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శనివారం నాడు ఉదయం ఇంటి నుంచి నేరుగా రైల్వే స్టేషన్‌కు వచ్చి రైల్వే స్టేషన్లో రెండవ నెంబర్ ప్లాట్‌ఫాం మీద వేగంగా వస్తున్న జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ కింద మృతి చెందింది. వేగంగా వస్తున్న రైలు కింద పడటంతో ఆమె శరీరం ముక్కలుగా రైలు పట్టాలపై చెల్లాచెదురుగా పడింది. ఒంగోలు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఒంగోలుకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యువకుడు అనుమానాస్పద మృతి

పెద్దఉల్లగల్లు పొలాల్లో లభ్యమైన మృతదేహం

ప్రజాశక్తి-ముండ్లమూరు



సుబ్బారెడ్డి (ఫైల్)

మండలంలోని వేముల గ్రామానికి చెందిన కుమ్మిత సుబ్బారెడ్డి (37) అనుమానావస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కుమ్మిత సుబ్బారెడ్డి వ్యవసాయ పనులు నిమిత్తం, తన కుటుంబ ఖర్చుల నిమిత్తం బంగారాన్ని పెద్ద ఉల్లగల్లు కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టి రూ. 4 లక్షలు తెచ్చాడు. ఆ బంగారం విడిపించడానికి ఈనెల 12వ తేదీ ఇంట్లో ఉన్న నాలుగు లక్షల రూపాయలను తీసుకొని తన మోటార్ సైకిల్‌పై ఉల్లగల్లు వెళ్లాడు. 14వ తేదీ ఉదయం పొలం వెళ్లిన ఉల్లగల్లు గ్రామస్తుడు వీఆర్‌ఏ కోటయ్యకు పొలాల్లో మృతదేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై కె.కమలాకర్ స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన భర్తకు పేకాట ఆడే అలవాటు ఉందని తన భర్తను డబ్బుకోసం పేకాట ఆడే వాళ్లే చంపి ఉరి వేసుకున్నట్లు చిత్రించారని శేషారత్నం పోలీసులకు తెలిపింది. మృతుడు సుబ్బారెడ్డి తీసుకువెళ్లిన 4 లక్షలు ఏమి అయ్యాయో అర్థం కావటం లేదని తెలిపింది. ద్విచక్రవాహనం ఒకచోట, చెప్పులు ఒకచోట పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు.

వాహనం ఢీకొని గేదె మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకగేదె మృతిచెందగా మరో రెండు గేదెలకు గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి ఉప్పుగుండూరు టోల్ గేట్ సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బొట్టు వేణు, కొమ్మనబోయిన శ్రీనివాసరావులకు చెందిన గేదెలను మేతకోసం పొలంకు తోలుకెళ్లాడు. శుక్రవారం రాత్రివరకు ఇంటికి రాకపోవడంతో వెతకగా, శనివారం ఉదయం మృతి చెంది కనిపించాయి. బొట్టు వేణుకు చెందిన గేదె మృతిచెందింది. దీని విలువ రూ.లక్ష ఉంటుందని బాదితుడు తెలిపాడు. మరో రెండు గేదెలకు గాయాలయ్యాయి.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ప్రజాశక్తి-సిఎస్.పురం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేసిన సంఘటన సిఎస్.పురంలో జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్ నాయక్ ఇచ్చిన వివరాల ప్రకారం.. మండలంలోని మిట్టపాలెం గ్రామానికి చెందిన పడుచూరి మోసే జూన్ నెల 2న సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్‌ఫోను కనుగొన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో బాధితునికి సెల్‌ఫోన్ అప్పగించారు. దీనిపై పలువురు ఎస్‌ఐని అభినందించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

కార్యకర్తల శిక్షణా తరగతుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య



మాట్లాడాతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - చీరాల

ఎన్నికల్లో చెప్పిన హామీలు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయకుండా మాటలతో కాలం వెళ్ళదీస్తుందని, దింతో ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక యుటిఫ్ కార్యాలయంలో సిపిఎం నాయకుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి కృష్ణమోహన్ అధ్యక్షతన రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్బంగా మొదటి రోజు వర్తమాన రాజకీయ పరిణామాలపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ మజుందార్ వివరించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్న సందర్భంగా సుపరి పాలన అందించినట్లు చెప్పుకుంటుందని, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడం లేదు, తల్లికి వందనానికి అనేక నిబంధనలు పెట్టి కోతలు పెట్టడం గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఏమి తేడా లేదని అన్నారు. పిల్లల చదువుకు ఇచ్చే డబ్బులు కోత వేయడం మంచిది కాదని అన్నారు. అర్హులైన అందరికి తల్లికి వందనం ఇవ్వాలని అన్నారు. కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. 164 స్థానాలు దక్కుంచుకున్న టిడిపి ప్రభుత్వం మంచి అందిస్తుందని ప్రజలు ఆశ పెట్టుకొన్నారని, రాష్ట్రానికి వనరులు రాబట్టుకోవడం, విభజన హామీలు అమలుపై కేంద్రం మీద వత్తిడి తెచ్చి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు భావించారని అన్నారు. ఆచరణలో ఆ ప్రయత్నం జరగలేదని అన్నారు. సూపర్ సిక్స్ వంటి పథకాలు ఇంటింటికి అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తున్నదని ఆరోపించారు. జిల్లాలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవటంతో ఆత్మహత్యలు చేసుకొంటున్నారని అన్నారు. కేవలం ప్రభుత్వ వైఫల్యం జిల్లాలో పేదలు నివాసం ఉంటున్న అనేక ప్రాంతాల్లో స్థానిక సమస్యలు ఎదుర్కొటున్నారని అన్నారు. వీటిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో సిపిఎం పోరాటాలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ బాబురావు, సిహెచ్ మణిలాల్, జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, వి వెంకటరామయ్య, ఎం ఆంజనేయులు, తిరుమల, వసంతరావు పాల్గొన్నారు.


శిక్షణా తరగతులకు హాజరైన సిపిఎం కార్యకర్తలు

'కుప్పడం' చీరాల గొప్పతనానికి నిదర్శనం

చేనేతల సభలో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య

ప్రజాశక్తి - వేటపాలెం


మాట్లాడుతున్న శాసన సభ్యులు కొండయ్య

కుప్పడం పట్టు చీరకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం చీరాల గొప్పతనానికి నిదర్శ నమని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. మండలంలోని దేశాయిపేటలో చేనేత కార్మికుల అభినందన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన 'చీరాల కుప్పడం' చీరలకు మార్కెట్‌లో ఈపాటికే కొంత డిమాండ్ ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అవార్డు ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం పొందుతుందని అన్నారు. చేనేతల శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందని చెప్పారు. జాతీయ మార్కెట్‌లోనూ కుప్పడం చీరలు ప్రత్యేకతను కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో పట్టు వస్త్రాల వ్యాపారుల్లో ఆనందాన్ని కల్లారా చూడటానికే ఈ సభ నిర్వహించినట్లు చెప్పారు.

మగ్గాలపై మాత్రమే నేసే 'కుప్పడం పట్టు'

చీరాలలో మాత్రమే దొరికే కుప్పడం పట్టు వస్త్రాలకు తనదైన ప్రత్యేకత ఉంది. వీటిని మగ్గాలపై మాత్రమే నేస్తారు. ఎంతో నాణ్యతగా కలర్ ఫుల్‌గా ఉండే కుప్పడం పట్టు చీరలు లైట్ వెయిట్‌గా ఉంటాయి. అందుకే వీటిని ధరించడానికి మహిళలు ఉత్సాహ పడుతుంటారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉండే ఉప్పాడ, ధర్మవరం వంటి పట్టు వస్త్రాలతో పోలిస్తే కుప్పడం పట్టుకు ఇంతవరకు పాపులారిటీ అంతగా లభించలేదు. దానికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కలెక్టర్ జె వెంకట మురళి ప్రత్యేక చర్యలు చేపట్టారు. జనవరి 9న జరిగిన కేంద్ర బృంద పర్యటనలో ప్రత్యేకంగా కుప్పడం పట్టు వస్త్రాలతో ఒక చిన్న సైజు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కుప్పడం పట్టు వ్యాపారులు రకరకాల చీరలను ప్రదర్శించారు. కుప్పడం పట్టు నాణ్యత ప్రత్యేకతలతో సంతృప్తి చెందిన కేంద్ర బృందం ఇప్పుడు జాతీయ అవార్డుకు కుప్పడం పట్టును సిఫార్సు చేసిందని అన్నారు. దేశ వ్యాప్తంగా కుప్పడం పట్టు పాపులారిటీకి ఈ అవార్డు దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, మాజీ ఎంపిటిసి సిద్ధి బుచ్చేశ్వరరావు, నిమ్మల పిచ్చయ్య, నాగమల్లేశ్వరి, యర్రబుద్ధి దుర్గా మల్లేశ్వరి, వెంగళ భరత్ బాబు, మాచర్ల సాంబశివరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

రేపల్లె బ్లడ్ బ్యాంకుకు రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - రేపల్లె


అవార్డు అందుకుంటున్న రెడ్‌క్రాస్ చైర్మన్ వసంత వీరరాఘవయ్య

ప్రపంచ రక్త దాతలు దినోత్సవం సందర్భంగా గుంటూరు భారతీయ విద్యా భవన్ సమావేశ మందిరంలో రెడ్ క్రాస్ సొసైటీకి రాష్ట్రస్థాయి అవార్డు ప్రకటించారు. అత్యధికంగా రక్తం సేకరించిన బ్లడ్ బ్యాంకులో ద్వితీయ స్థానం వచ్చిన రేపల్లె రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకుకు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా రేపల్లె రెడ్ క్రాస్ చైర్మన్ వసంతం వీర రాఘవయ్య శనివారం అవార్డు అందుకున్నారు. రేపల్లె రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి, మౌళిక వసతులు అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రక్త సేకరణలో అన్ని రకాలుగా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. రక్త సేకరణలో కృషి చేసిన యువత, కాలేజీ విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది మంత్రి సత్యప్రసాద్ కృషితో నాట్కో ఫార్మా ఆర్థిక సహకారంతో బ్లడ్ బ్యాంకును బ్లడ్ బ్యాంక్ కాంపోనెంట్స్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎపి స్టేట్ చైర్మన్ యార్లగడ్డ దశరథ రామారావు, కోశాధికారి పి రామచంద్రరావు, రామచంద్రరాజు, వడ్లమాని రవి పాల్గొన్నారు.


సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఆనందబాబు

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - వేమూరు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన దీపాల లక్ష్మి నరసమ్మ, ఐలవరం గ్రామానికి చెందిన కౌతవరపు వెంకటసుబ్బారావు, దీపాల రామ భద్రావతి అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసమైన బిల్‌ను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఫార్సు ద్వారా సిఎం సహాయ నిధి కార్యాలయానికి పంపించగా సిఎం సహాయ నిధి నుంచి దీపాల లక్ష్మి నరసమ్మకు రూ.94,892, కౌతవరపు వెంకటసుబ్బారావు రూ.50వేలు, దీపాల రామ భద్రావతికి రూ.31,278 చొప్పున మంజూరైన రూ.1,76,170 చెక్కులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిసిగా ఎస్ఆర్ 'తుళ్ళూరి'

ప్రజాశక్తి - మేదరమెట్ల


సిసి టి శ్రీనివాసరావు

కొరిశపాడు క్లస్టర్ వెలుగు డిఆర్డిఏ కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా తుళ్ళూరి శ్రీనివాసరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి మండలం మోదేపల్లి క్లస్టర్ సీసీగా గతేడాది నుంచి పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కొరిశపాడు క్లస్టర్‌కు వచ్చారు. గతంలో ఇదే క్లస్టర్‌లో సీసీగా పనిచేసిన మెత్తల్లా మేరీ కుమారి ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం తిమ్మసముద్రం క్లస్టర్ సీసీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిసిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో కొరిశపాడు మండలంలో పనిచేసిన అనుభవంతో వెలుగు, డిఆర్డిఏ పథకాలు స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలకు సక్రమంగా అందేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం మాణిక్యరావు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి - చీరాల


కోడూరు ప్రసాదరెడ్డి

వైసిపి జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులుగా కోడూరు ప్రసాదరెడ్డి నియమితులయ్యారు. వైసిపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనకు ఉపాధ్యక్ష బాధ్యత అప్పగించిన వైసిపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, వైసిపి జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, మాజీ ఎంఎల్ఎ కరణం బలరామ కృష్ణమూర్తి, వైసిపీ నియోజకవర్గం ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు, పార్టీ సీనియర్ నాయకులకు ప్రసాదరెడ్డి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీని బలోపేతం చేయటానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అగ్నిమాపక అధికారిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రేపల్లె


వెంకటేశ్వరరావు

అగ్నిమాపక అధికారిగా వై వెంకటేశ్వరరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల అగ్నిమాపక కార్యాలయం నుండి సాధారణ బదిలీలో భాగంగా ఆయన రేపల్లె అగ్నిమాపక కేంద్రానికి వచ్చారు. సిబ్బంది సహకారంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.


సాలెం రాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

షాలేం రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేమూరు

భట్టిప్రోలు మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైకేపల్లి శాలెం రాజు జన్మదిన వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన తన ఫౌండేషన్ ద్వారా అనేక మందికి సహాయం చేస్తూ ప్రజల అండ దండలు పొందుతూ ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు విజయానికి విశేష కృషి చేసి ఘన విజయాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షాలెం రాజు జన్మదిన వేడుకలను జెఆర్ మేనేజ్ మెంట్ సర్వీసెస్, ప్రైవేట్ లిమిటెడ్ ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా వారి కార్యాలయంలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి, కొల్లూరు మాజీ ఎంపిపి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, అమృతలూరు మాజీ అధ్యక్షులు గొట్టిపాటి భాను గంగాధర్, టిడిపి భట్టిప్రోలు అధ్యక్షులు కుక్కల వెంకటేశ్వర రావు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీలకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ప్రజాశక్తి - వేమూరు

'తల్లికి వందనం' పథకాన్ని అంగన్వాడీ కార్యకర్తలకు వర్తింప చేయాలని సిఐటియు కార్యదర్శి బి అగస్టీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ పరిమితిని సడలించి ఏడాదికి రు.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ తల్లికి వందనం వర్తింప చేయాలని కోరారు. గత ప్రభుత్వం విధించిన షరతులను అప్పట్లో విమర్శించిన కూటమి నేతలు ఇప్పుడు అవే షరతులు పెట్టి తల్లికి వందనంకు అంగన్వాడీలను దూరం చేయడం సరైనది కాదన్నారు. ఎన్నికలకు ముందు స్కీం వర్కర్స్ అందరికి సంక్షేమ పథకాలు ఇస్తామని ఎన్నిలకు ముందు చెప్పి నేడు ఇవ్వకపోవడం మోసం చేయడమేనని ఆరోపించారు. అంగన్‌వాడీలకు ఎలాంటి వేతనం పెంచకపోగా ఇచ్చే అరకొర వేతనంను ప్రభుత్వ పథకాలు వర్తింప జేసేందుకు అడ్డం పెట్టుకొని వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పునరాలోచించి అంగనవాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్-ఏపీ లారీ అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. జూలై 1 ,16 తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్న మహాసభల కరపత్రాన్ని సిఐటియు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి , ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో ట్రాలీరంగం, రవాణా రంగం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్రం తెచ్చిన వెహికల్ అమెండ్మెంట్ యాక్ట్ వల్ల రవాణా కార్మికులకు కలుగుతున్న నష్టాల గురించి రెండు రోజులపాటు జరిగే మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. జీవో నెంబర్ 21తో రాష్ట్రంలో ఆటో, లారీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రవాణా వాహనాలపై అన్ని రకాల చలనాలు పెంచుతున్నారని వివరించారు. పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు విధిస్తున్న అక్రమ జరిమానాలు రద్దు చేయాలన్నారు. ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యాల నుంచి ఆటో రంగాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. డ్రైవర్లకు శిక్షలు పెంచుతూ భారత న్యాయ సంహిత చట్టంలో ప్రవేశపెట్టిన 106 సెక్షన్లు మార్చాలని కోరారు. కేరళ, తమిళనాడు తరహా డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికులకు పర్మినెంట్ స్టాండ్ల కోసం సంఘం పోరాడుతుందని శ్రీనివాసులు గుర్తు చేశారు. అదేవిధంగా నేషనల్ హాలిడేస్ బకాయిల కోసం మేనేజ్మెంట్ స్పష్టమైన హామీ కోసం నాలుగు మాసాల పోరాడి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. ఆర్‌టిసి రంగంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి రక్షణకై పోరాడుతున్నట్లు అయ్యప్పరెడ్డి చెప్పారు. ఈ మహాసభలకు 26 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15,16 తేదీల్లో ఒంగోలు నిర్వహిస్తున్న మహాసభలకు అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యోగులు కార్మికులు ప్రజలు ఆర్థిక, హార్థిక సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమం లో రవాణా రంగం జిల్లా నాయకులు సయ్యద్ మున్వర్ బాషా, రమణయ్య పాల్గొన్నారు.



రక్తదాతను సత్కరిస్తున్న డాక్టర్ దుర్గా దేవి

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు రక్త నిధులలో పూర్తి స్థాయిలో రక్త నిల్వలు ఉండేలా చూడాలని, ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేలా చర్యలు తీసుకోవాలని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దుర్గా దేవి, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భగా ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో శనివారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ సార్లు రక్త దానం చేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

. ఇటీవల బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు-2 వేలం కేంద్రానికి మంత్రులు డాక్టర్ డోలా శ్రీ బాల విరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ సందర్శించారు. కంపెనీలు, బోర్డు ఇడి తో చర్చించారు. దీంతో పొగాకు ధరలో మార్పు వస్తుందని వస్తుందని రైతులు భావించారు. పొగాకు ధరల్లో మార్పు లేక పోగా నోబిడ్ శాతం పెరిగింది. రీజియన్ పరిధిలోని రైతులు శనివారం 9,221 బేళ్లు అమ్మకానికి తెచ్చారు. అందులో 6,670 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 2551 బేళ్లను(27.66 శాతం) తిరస్కరించారు. బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు - 1, 2, వెల్లంపల్లి,టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 4,778 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 3, 598 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 1.180(24.69 శాతం) బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180 పలికింది.సగటు కిలో రూ.248.89 పైసలు పలికింది. లైట్ సాయిల్ పరిధిలో పొదిలి, కనిగిరి,కందుకూరు 1,2 కలిగిరి,డిసిపల్లి వేలం కేంద్రాలకు 4,444 అమ్మకానికి తెచ్చారు. అందులో 3. 072 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత1,371 (30.85శాతం)బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.180, సగటు ధర రూ 245.53 పైసలు పలికింది.

యోగాతో ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అభివృద్ధి, సంక్షేమంతో పాటు యోగాతో ఆరోగ్యం దాని సంతోష ఫలాలను ప్రజలు అందుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. యోగాంధ్ర అవగాహనలో భాగంగా పిట్టలవానివారిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి యోగాసనాల ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేర్ నాచురోపతి వైద్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుతున్నాయి. అనంతరం గ్రామ ప్రధాన కూడలి వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. వికసిత్ భారత్ దిశగా కేంద్రం, స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. అభివద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఆ ఫలాలను ప్రజలు అందుకోవాలన్నారు. మానసిక సమతుల్యత లేని సమాజాన్ని యోగా సరి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఉద్యోగాలు, పనులలో ఒత్తిడికి



యోగాసానాలు వేస్తున్న కలెక్టర్

గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మానసిక ఒత్తిడి నుంచి యోగా విముక్తి కల్పిస్తుందన్నారు. నాణ్యమైన జీవితం యోగాతోనే సాధ్యమన్నారు. నాచురోపతి యోగా జీవితంలో ఓ భాగం కావాలన్నారు. యోగాసనాలతో కలిగే ప్రయోజనాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎలాంటి ఖర్చు, మందులు లేకుండా రోగాలు నివారించడం యోగాతోనే సాధ్యమన్నారు. ఈనెల 21న చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో విశాఖపట్నంలో ప్రపంచ యోగ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రధానమంత్రి మోడీ హాజరయ్యే ఈ కార్యక్రమానికి అనుబంధంగా జిల్లా కేంద్రమైన బాపట్ల సూర్యలంకలో పదివేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. విద్యార్థులు యోగాసనాలతో తమ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని సూచించారు. కేర్ నాచురోపతి వైద్య కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఆ విద్యార్థులు జిల్లాస్థాయి యోగాసనాలలోనూ ప్రథమ స్థానం సాధించడం పట్ల కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాలరావు, ఎక్సైజ్ శాఖ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి చెగువేరా స్ఫూర్తి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రపంచ శాంతికి చెగువేరా స్ఫూర్తి నిచ్చారని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి సిహెచ్. వినోద్ పేర్కొన్నారు. చేగువేరా జయంతి సందర్భంగా స్థానిక ఎన్ఆర్ఐ కాలేజీ వద్ద శనివారం సెమినార్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వినోద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించడానికి సిద్ధంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చిన చెగువేరా స్ఫూర్తి యువతకు ఆదర్శమన్నారు. ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను, అణిచివేతను యువత వ్యతిరేకించాలని కోరారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న అమెరికా బయట పడటానికి ఉక్రెయిన్‌ను అడ్డంపెట్టుకొని రష్యాను కొల్లకొట్టడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇజ్రాయిల్‌ను అడ్డు పెట్టుకొని ఇరాన్ వనరులను లూటీ చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అమెరికా యుద్ధాలను ప్రేరేపిస్తూ ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తున్నదన్నారు. పాలస్తీనాలో లక్షల మంది ప్రజలు ప్రాణాలు



నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కోల్పోతున్నారన్నారు. ప్రపంచ మానవాళి విముక్తి కోసం పోరాడిన చెగువేరా జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. విద్యారంగంలో కాషాయీకరణ చొప్పిస్తున్నట్లు ఆరోపించారు రాష్ట్రాల హక్కులు, రాజ్యాంగాన్ని బలహీనం చేస్తుందని విమర్శించారు. కార్మికుల కష్టజీవుల హక్కుల కోసం పోరాటం చేయడమే చెగువేరాకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కె. విజయ్ కుమార్, నగర నాయకులు పి.దేవా, టి.విజయ్, ఒ. కార్తీక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

సర్పంచుల పిల్లలకూ..

‘తల్లికి వందనం’ వర్తింపజేయాలి

ఎపి సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



తల్లికి వందనం పథకాన్ని రాష్ట్రంలోని సర్పంచుల పిల్లలకు సైతం వర్తింజేయాలని, ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎపి సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,325 గ్రామపంచాయతీల్లో సర్పంచులు ఉంటే వారి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపు కాలేదని తెలిపారు. అనేక నిబంధనల కారణంగా అర్హులైన వారికి కూడా ఈ పథకం అందటం లేదన్నారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచుల పిల్లలకు కూడా రావడం లేదు. సర్పంచుల్లో ఎక్కువ మంది ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,మైనార్టీ వర్గాలకు చెందిన వారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు ఉన్నట్లు తెలిపారు. సర్పంచులకు గౌరవ వేతనం నెలకు రూ.3000 ఇస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొనడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి సర్పంచుల పిల్లలకు కూడా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. సర్పంచుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయని పక్షంలో సర్పంచులందరమూ కలిసి ఆందోళన చేపడతాని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పొగాకు రైతులను కలవరపెడుతున్న ఆంక్షలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇందుకు సంబంధించి గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వివిధ మార్కెట్ యార్డు గోదాముల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటానికి సమాయత్త మైంది. ఈపాటికి అందుకు సంబంధించిన చర్యలు మార్క్ఫెడ్, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ అధికారులు చేపట్టారు. అయితే నల్లబర్లీ పొగాకు పండించిన రైతులు పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్ అధికారులు కొన్ని సూచనలు, ఆంక్షలు పెట్టారు. కొనుగోలు కేంద్రాలకు పొగాకు తెచ్చే రైతులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటన చేశారు. మార్క్ ఫెడ్ అధికారులు హెచ్డి (నల్లబర్లి) పొగాకు కొనుగోలుకు చేసిన సూచనలు చేశారు.

నల్లబర్లీ రైతులకు అధికారుల సూచనలు

రైతులు తప్పనిసరిగా తోరణాలు కట్టి ఎండబెట్టిన రకం పొగాకునే తేవాలని, తోరణాల తాడు తీసి బేళ్ల కట్టాలని అధికారులు తెలిపారు. పొగాకు రకాలను గ్రేడ్ చేసి నాణ్యత, ఆకు మందం పరిపక్వత గుర్తించి ఏ రకం ఆకు ఆ రకానికి గ్రేడ్ చేసి గ్రేడ్ల ప్రకారం పొగాకు చెక్కులు తయారు చేయాలని సూచించారు. పొగాకు ఆకుల నాణ్యత, ప్రమాణత, రంగు, మందం బట్టి ఏ రకం ఆ రకం బేళ్ల తయారు చేయాలని పేర్కొన్నారు. ఏ రెల్లులకు ఆ రెల్లులను మాత్రమే బేళ్ల కట్టాలని, పొగాకు ఏ వలుపుకు ఆ వలుపే చెక్కులు తొక్కాలని, తొక్కిన చెక్కుల్లో ఆకు తేమశాతం 20 శాతం మించకూడదని తెలిపారు. పొగాకు చెక్కులు కట్టిన (తొక్కిన) ఆకు తేమశాతం 20శాతంకు మించితే కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తామని తెలిపారు. కట్టిన పొగాకు బేళ్ల 25కేజీలు అతి తక్కువ బరువు 150కేజీలు బరువు మించరాదని తెలిపారు. పొగాకు బేళ్ల తయారు చేయటానికి వాడిన గోనె పట్టలు పలుచగా ఉంటే తరుగు ఒక కేజీ మందంగా ఉంటే 20కేజీల తూకం తీయనున్నట్లు తెలిపారు. చవిటి నేలలో పండించిన సెలైన్ పొగాకు కొనబడదని తెలిపారు. పొగాకు బేళ్ల మధ్య తాళ్లు, ప్లాస్టిక్, పక్షి, జంతు, లోహ సంబంధమైన వ్యర్థాలు ఉండకూడదని తెలిపారు. మార్క్‌ఫెడ్ నిర్దేశించిన పొగాకు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు రైతులు తేవాలని, ప్రతి రైతు హెచ్‌డి పొగాకు సీఎం యాప్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మార్క్‌ఫెడ్ అధికారులను కానీ, వ్యవసాయ అధికారులను కానీ రైతులు కలసి సమాచారం తీసుకోవాలని కోరారు.

ఇన్ని ఆంక్షతో రైతులు అమ్ముకోగలరా?

ఇప్పటికి పొగాకు చెక్కులు కట్టి నాలుగు నెలలుపైగా అయ్యింది. రైతులు పొగాకు కొనేవారు లేక నిల్వ చేసుకునే వసతి లేక ఎక్కువ మంది పొగాకు నిల్వలను ఆరుబయటే మండేలు కట్టి ప్లాస్టిక్ పట్టలు కప్పారు. దీనికి తోడు సరైన ఆకు పక్వం సమయంలో కూలీల కొరతతో రెల్లులు సకాలంలో కొట్టలేక రంగు తక్కువగా ఉంది. మొదటి ఒలుపు కొట్టి ఐదు నెలలుపైగా కావటంతో అవి రంగు మారతాయి. కొన్ని ప్రాంతాల్లో కొంత వర్షానికి తడిసి రంగు మారింది. రైతులు పండించిన పంట సంరక్షణ చేసుకుంటూ మండేలు తిరగవేసుకుంటూ తప్పనిసరిగా ఒలుపులు, గ్రేడు, ఆకు నాణ్యత, బేళ్ల కట్టడం తప్పనిసరైంది. ఎంత చేసిన పండిన పొగాకు గిట్టుబాటు అయ్యేవరకు మార్కెట్ అధికారులు తప్పనిసరిగా కొంటేనే రైతులు నష్టాలబాట నుంచి కొంతమేరకు ఒడ్డుకు వచ్చే పరిస్థితి ఉంది. ప్రైవేటు కార్పోరేట్ కంపెనీల్లో పొగాకు నాణ్యత సాగుతో తిరష్కరిస్తే రైతులు ఎప్పటిలా నష్టపోవటం తప్పనిసరని రైతులు అంటున్నారు. పొగాకు ఆంక్షలు కొంతమేరకు సడలించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులు పూర్తిగా పాడైపోయిన పొగాకు తేవటం మంచిది కాదని, అలాంటి పొగాకు తెచ్చినందువల్ల రైతులే ఇబ్బంది పడతారని అన్నారు. రానుపోను బాడుగలు, చెక్కులు తొక్కుడు ఖర్చులతో ఇబ్బంది పడుతారని అధికారులు అంటున్నారు.

చేనేత రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేటపాలెం

చేనేత రంగాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర ఆరోపించారు. స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపంలో చేనేత రంగంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత వర్గం ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. చేనేత సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు మాట్లాడుతూ చేనేత సమస్యలు పరిష్కారం కావాలంటే చేనేత కార్మికుల సమస్యలపై గళం వినిపించాలని కోరారు. అలా కాకుంటే ఏ ప్రభుత్వం కూడా ఆ వర్గాలను పట్టించుకోవడం జరగదని అన్నారు. గ్రామ గ్రామన చేనేతలు చైతన్యం కావాలని అన్నారు. అందుకోసం గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పెద్ద ఎత్తున చేనేతలు ఆందోళనలు చేసినప్పుడే ప్రభుత్వాలే మన సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. మాజీ ఎంపిపి దామర్ల శ్రీకృష్ణ మాట్లాడుతూ నిరంతరం చేనేతల సమస్యలపై కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. చేనేత వృత్తి పరిరక్షణకు నూలు, సిల్క్ ధరలు నియంత్రించాలని కోరారు. చేనేతల సంక్షేమం కోసం త్రిఫ్ట్, ఆరోగ్య భీమా, రుణాలు, ఐఎవై గృహ నిర్మాణ పథకాలు అమలు చేయాలని కోరారు.


మాట్లాడుతున్న బీరక సురేంద్ర

నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని, ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా రూ.30వేలు ప్రతి చేనేత కార్మికునికి ఇవ్వాలని కోరారు. చేనేత సహకార సంఘాల పాలక మండలి ఎన్నికల నిర్వహించి పాలకవర్గాలు ఉనరుద్దరించాలని కోరారు. చేనేత రిజర్వేషన్ చట్టం, చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని అన్నారు. చేనేత కార్పొరేషన్లకు పాలక మండలి నియమించాలని కోరారు. మావేశంలో రాష్ట్ర చేనేత జన సమైక్య అధ్యక్షులు దేవన వీర నాగేశ్వరరావు, చుండురి వాసు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, మునగాల వెంకటేశ్వర్లు, బండ్ల వెంకటేశ్వరరావు, గౌరబత్తుని రవిబాబు, కనగాల సూర్య నారాయణ, కందుల సురేష్, గోలి గిరి, గుంటూరు మల్లికార్జున, గుత్తి సదాశివరావు, అధిశేషు, వెంకటరెడ్డి, గంజి సతీష్, భాస్కరరావు, దాశరథి పాల్గొన్నారు.

యువకుడిపై కర్రతో దాడి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


గాయపడ్డ అశోక్ బాబు

ట్రాక్టర్ స్పీడుగా నడపవద్దని హితవు పలికిన యువకుడిపై కక్ష పెంచుకున్న మరో యువకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మార్టూరు సమీపంలోని వలపర్లలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మూకిరి అశోక్ బాబు స్థానిక కేబుల్ టివిలో పనిచేస్తున్నాడని, అదే కాలనికి చెందిన గంటినపల్లి సునీల్ ట్రాక్టర్ స్పీడుగా నడుపుతూ రోడ్డు ప్రక్కన నిల్చుని ఉన్న అశోక్ నాయనమ్మ మీదకి ట్రాక్టర్ తగులుతున్నట్లుగా వెళ్లడంతో ఇళ్ల మధ్య ఎందుకు అంత స్పీడుగా వెళ్తావని మందలించాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన సునీల్ జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఇంటి ఎదురుగా ఉంటున్న అశోక్‌పై కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్రంగా గాయమవడంతో ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎం శేషగిరిరావు, ఎస్ఐ షేక్ సైదా తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - బాపట్ల

ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఉప్పరపాలెంకు చెందిన రాజు నాగార్జునరెడ్డి, శారదాపురి కాలనీకి చెందిన ఉన్నం వంశీ, మల్లావుల ధర్మ తేజ, షేక్ చందు, జాలాది జాన్, మరో మైనర్ బాలుడు కలిసి పట్టణం తోపాటు, చీరాల రూరల్, చీరాల టూ టౌన్, వెదుళ్ళపల్లి, బాపట్ల రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఆరు ద్విచక్ర వాహనాలు, నీళ్ళమోటర్, రెండు సవర్ల బంగారం గొలుసు దొంగిలించారని తమ విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. పట్టణంలోని జగనన్న కాలనీకి చెందిన పలతోటి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. నిందితులు దొంగిలించిన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని


వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

విచారించినట్లు తెలిపారు. చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆరు వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండు సవర్ల బంగారపు గొలుసు, మోటర్‌ను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులో ఎంతో కీలకంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేసిన పట్టణ సిఐ రాంబాబు, ఎస్ఐ విజయ్ కుమార్, ఎస్ఐ చంద్రావతి, సిబ్బంది ప్రభాకరరావు, మనోజ్, శ్రీనివాసరావు, పోతురాజు, కృష్ణ కిషోర్‌ను ఎస్పీ తుషార్ డూడి అభినందించినట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచిపర్చినట్లు తెలిపారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పర్చూరు

యోగ పట్ల ప్రజలు ఆసక్తి కలిగి ఉండాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. యోగాంధ్ర 2025లో భాగంగా మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని ప్రజలకు యోగపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం ఆయుష్ ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రజలకు యోగ పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి కె సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి మస్తానరావు, విఆర్ఓ వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.


హరిబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

చైర్మన్ హరి బాబుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వేమూరు

గుంటూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వడ్రానం హరిబాబు నాయుడును జనసేన నాయకులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో కోపరేటివ్ సొసైటీలు బలోపేతమై రైతులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించడంలో తోడ్పాటు అందిస్తాయని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి సోమరౌతు అనురాధ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని సొసైటీలకు కమిటీలు నియమించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మదులు, రుణాలు వంటి సౌకర్యాలు కల్పించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాలపాటి రాకేష్, తాడికొండ కోటేశ్వరరావు, తాడికొండ మురళి, అమ్మయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024- 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో జరిగిన పనులు, వాటి పరిస్థితి, పని దినాలు, గణాంకాలు వంటి వివరాలు ఆడిట్ టీం ప్రజలకు వివరించారు. గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై గ్రామ ప్రజల అభిప్రాయం సేకరించారు. పనులు చేసిన వాటి వివరాలతోపాటు ఖర్చు చేసిన నిధుల లెక్కలు, కూలీలకు చెల్లింపు వివరాలను ప్రజలకు వివరించారు. అవక తవకలు జరిగినట్లు అనుమానం ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. అనంతరం మండల స్థాయిలో తనిఖీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కరీముల్లా, అద్దంకి, కొరిశపాడు ఎపిఓలు కోటేశ్వరి, గాయత్రి పాల్గొన్నారు.


రమాదేవి మృత దేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టిడిపి నేత రమాదేవికి నివాళి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

మండలంలోని అద్దెపల్లి దళితువాడకు చెందిన తెలుగుదేశం సీనియర్ కార్యకర్త కూరపాటి రమాదేవి అనారోగ్య కారణాలతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి బీసీ సెల్ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు, జడ్పిటిసి తిరువీధుల ఉదయభాస్కరీ, బాలాజీ, వెల్లటూరు డిసీ అధ్యక్షులు వై కరుణ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, భట్టిప్రోలు పట్టణ అధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరావు, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు జగ్గం శ్యామ్ సన్, ఎస్సీ సెల్ కార్యదర్శి పోకూరు సురేంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు ఇబ్రహీం బెగ్, ఎడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఐఐఐటికి విష్ణుప్రియ ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం



దంతం విష్ణుప్రియ

మండలంలోని పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాల్లో 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 591 మార్కుల తో జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించిన దంతం విష్ణు ప్రియ నూజివీడు ఐఐఐటికి ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్లో 9.7జిపిఎ సాధించారు. అనంతరం దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ ఐఐఐటిలో ఇంజినీరింగ్ ప్రవేశానికి నిర్వహించిన ఎస్‌పిఈసి (స్పెషల్ ఛానల్ ఫర్ ఎడ్యుకేషన్) ప్రవేశ పరీక్షల్లో కంప్యూటర్ సైన్స్ కోర్సుకు ఎంపికయ్యారు. ఈ ప్రవేశపరీక్ష ప్రతి ఏటా జెఈఈ మెయిన్స్ పరీక్ష తరహాలో నిర్వహిస్తారు. హైదరాబాద్ ఐఐఐటి క్యాంపస్‌కు ఎంపికైన ప్రతిభ చూపడం పట్ల పలువురు అభినందించారు. ఆర్థిక స్తోమత లేని అత్యంత పేద విద్యార్థి ఫీజు చెల్లించడంలో ఇబ్బంది పడకుండా బ్యాంకులే విద్యా రుణం మంజూరు చేస్తాయి. ఆ క్యాంపస్‌లో చదివి, ఉన్నత స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కూడా ఎంపికైన పేద విద్యార్థులను దత్తత తీసుకొని వారి నాలుగేళ్ల ఫీజు చెల్లిస్తారు. కోర్సు పూర్తయిన రెండేళ్ల తర్వాత విద్యార్థి తీసుకున్న రుణం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. మరల వీరు ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత ఎంపికైన కొత్త విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా తనను అనునిత్యం ప్రోత్సహిస్తూ హైదరాబాద్ ఐఐఐటికి ఎంపిక కావడంలో విలువైన సూచనలు ఇచ్చిన గుంటూరు శివశంకర్ మాస్టారికి విష్ణుప్రియ, రామన్నపేట నివాసులైన ఆమె తల్లి, దండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు బి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రెసిడెంట్ ఊటుకూరు శ్రీమన్నారాయణ, సెక్రటరీ రొండా దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి తదితరులు దంతం విష్ణుప్రియకు అభినందనలు తెలిపారు.



రోడ్డు కూడా లేని పంగులూరు జగనన్న కాలనీ

జగనన్న కాలనీలో సమస్యల తిష్ట

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక జగనన్న కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ఈ సమస్యలు ఎప్పటికి పరిష్కారం చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పంగులూరు గ్రామానికి తూర్పున గత ప్రభుత్వంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. అందులో సుమారు 84 ప్లాట్లు ఉన్నాయి. దాదాపు 75శాతం ఇల్లు నిర్మించుకున్నారు. నిర్మించిన ఇళ్లల్లో నివాసం కూడా ఉంటున్నారు. అయితే వారు నివసించేందుకు అనేక సమస్యలు అడ్డంకిగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి సంబంధించి జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంకు నిర్మించారు. పైపులైన్లు కూడా వేశారు. అయితే వాటర్ సరఫరా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కరెంటు స్తంభాలు వేశారు. లైన్లు లాగారు. అయితే కనెక్షన్లు ఇవ్వకపోవటం వలన చీకటి పడితే నడవాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. చీకట్లో విష సర్పాలు తిరుగుతున్నాయని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు వేయకపోవడంతో నడవాలంటే సమస్యగా ఉందని తెలిపారు. ఏదైనా వాహనాలు రావాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ కాలనీలో సమస్యలను ప్రభుత్వ అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రక్తదానం చేసి.. ప్రాణదాతలు అవ్వండి



ప్రతిజ్ఞ చేస్తున్న ఏరియా వైద్యశాల సూపరిడెంట్ శ్రీకాంత్

ప్రజాశక్తి - చీరాల

రక్తదానంలో అందరూ భాగస్వాములు కావాలని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఏరియా వైద్యశాల సూపరిడెంట్ శ్రీకాంత్, డాక్టర్ సెల్వరాజ్ అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల్లో వైద్యులు రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు. ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలకు రక్తం అవసరం పడుతుందని అన్నారు. ప్రమాదాలు, శస్త్ర చికిత్సలు, క్యాన్సర్ చికిత్సలు, ప్రసవ సంబంధిత సమస్యలు, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం అత్యవసరం అన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి కొన్ని వ్యాధుల ప్రమాదం తగ్గుతుందనే అధ్యయనాలు సూచిస్తున్నాయని వివరించారు. 18 నుండి 65 ఏళ్ల మధ్య వయసున్న అందరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. అనంతరం వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియార స్థంభం సెంటర్ వరకు జరిగింది.

అద్దంకి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇప్పటి వరకు 30సార్లు రక్తదానం చేసిన సినియర్ రొటేరియన్ నాగినేని రామ కృష్ణకు స్థానిక గీతా మందిరంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కావూరి రఘు చంద్ మాట్లాడుతూ రక్తదానంపై ప్రజలు అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న వాళ్ళు ఏడాదికి మూడు సార్లైన రక్తం ఇవ్వవచ్చని, ఇస్తే ఇచ్చిన దాతకు కూడా మంచి ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మొహమ్మద్ రఫీ, డాక్టర్ కావూరి రఘచంద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సయ్యద్ మౌలాలి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, రఘురామశర్మ, అంజాద్‌భాషా, శేషారెడ్డి, లక్ష్మారెడ్డి, మన్నం త్రిమూర్తులు, అలహరి హరి ప్రసాద్, బాచిన పూర్ణచంద్రరావు, టీచర్ కృష్ణారావు, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నాగినేని రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

రంగస్థల నటుడు జయబాబు హఠాన్మరణం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని నంబూరువారిపాలెం నివాసి, చింతామణి నాటకంలోని సుబ్బిశెట్టి పాత్రధారి, తెలుగుదేశం నియోజకవర్గం సాంస్కృతిక ఉపాధ్యక్షులు నూకతోటి జయబాబు (59) గుండెపోటుతో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలోని అతని ఇంటి వద్ద కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు గోవాడ శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణకు విషయం తెలియపరచి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. తక్షణ సహాయంగా తాను వ్యక్తిగతంగా రూ.15 వేలు జయబాబు కుమారుడైన నూకతోటి శరత్‌కు గోపాలకృష్ణ తరపున అందజేశారు. గోవాడ శ్రీకాంత్ మాట్లాడుతూ అద్దంకి రంగస్థలం ఒక గొప్ప నటుడిని కోల్పోయిందని అన్నారు. ఆయన స్థానం ఎవరూ భర్తీ చేయలేరని అన్నారు. విషయం తెలియచేసిన వెంటనే కళాకారులకు ఎల్లప్పుడూ తోడుగా నిలిచే గోపాలకృష్ణ ఏపి రంగ స్థల కళాకారుల వేదిక తరపున శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామాపురం వెంకటేశ్వరరావు చౌదరి, షేక్ మీరావలి, జ్యోతి రమేష్, మిడసల మల్లికార్జునరావు, మాబు, ఆలకుంట శ్రీనివాసరావు, తన్నీరు నాగేశ్వరరావు, రామదాసు, ఉలిచి బాబూరావు, బుజ్జి, లక్ష్మయ్య, నెల్లూరు నుంచి ప్రముఖ సీనియర్ నటీమణి భానుమతి, కృష్ణకుమారి, వెంకటకృష్ణ, అశ్విని, గుంటూరు, నరసరావుపేట ప్రాంతాల నుంచి తోటి కళాకారులు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

17 నుంచి బర్లీపొగాకు కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక మార్కెట్ యార్డులో ఈనెల 17న నల్లబర్లీ పొగాకు కొనుగోలును అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సోషల్ వెల్ఫేర్, వికలాంగుల శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పొగాకు కొనుగోలు ప్రారంభిస్తారని తెలిపారు. ఇందుకోసం మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. పొగాకు కంపెనీలు నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు అనుమతించినట్లు తెలిపారు. ఈ నెల 7న లాంఛనంగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని, 17 నుంచి పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ యుద్ధప్రాతిపదికన విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

మంత్రి అచ్చెన్నతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

పొగాకు కొనుగోలుకు సంబంధించి విధివిధానాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సెక్రటేరియట్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు కీలక ఆదేశాలు ఇచ్చారు. తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో ఎక్కడా లోపాలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రధానంగా గోడౌన్ సామర్థ్యం, నిల్వ ప్రక్రియ, హమాలీల నియామకం, ఏజెన్సీలు, ఆన్లైన్ టోకెన్ విధానం, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని నల్లూరు నార్త్ గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్లూరి రమేష్ (42) శనివారం ఇంటి వద్ద ట్రాక్టర్ ఇంజన్ మరమ్మత్తులు చేస్తుండగా ట్రాక్టర్ ఇంజన్ ఒక్కసారిగా స్టార్ట్ అయ్యి రమేష్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ కోర్సులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్, ఆక్వా కల్చర్ కోర్సులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు జాతీయ మత్స్యకార సంఘం ప్రధాన కార్యదర్శి అనంత నాగేష్ శనివారం తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమా, పీజీ కోర్సులు పూర్తిచేసిన 18 నుండి 32ఏళ్ళ వయసు గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఆక్వాకల్చర్ టెక్నికల్ సూపర్వైజర్, ఆక్వాటిక్ ఎనిమల్ హెల్త్ ల్యాబ్ సూపర్వైజర్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులకు అదే విభాగంలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన సారథ్యంలో సీడ్ ఏపి ఆధ్వర్యంలో లక్షిత బయో రిసోర్స్ శిక్షణ కళాశాల ద్వారా శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 91003 69674 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - యద్దనపూడి

వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిధిలోని యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని యద్దనపూడి1 (ఎస్‌సి), పెద్ద జాగర్లమూడి1 (ఒసి) గ్రామాల్లో ఆశా కార్యకర్తల ఒక్కొక్కటి చొప్పున ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకోనున్నట్లు తెలిపారు. వివాహిత, విడో, విడాకులు పొందిన భర్త నుండి విడిగా నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. 25 నుండి 45 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, దరఖాస్తు చేస్తున్న మహిళ ఆ గ్రామం కోడలై ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 18లోపు యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నందు తమ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామ ఆరోగ్య, పరిశుభ్రత కమిటీ (విహెచ్‌ఎస్‌సి) ద్వారా అర్హత గల అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు సంబంధిత ధరకాస్తును సచివాలయ ఎఎన్ఎం వద్ద తీసుకోవాలని డాక్టర్ శ్రీహర్ష తెలిపారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశానుసారం జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణంలో 8వ సచివాలయం నందు ప్రజలతో యోగా, యోగా అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ సుధాకరరావు మాట్లాడుతూ యోగా అనేది ప్రతిఒక్కరి జీవితంలో ప్రధాన భూమిక వహిస్తుందని అన్నారు. యోగా గురువు చాగంటి శేషారెడ్డి వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం 15వ వార్డు ఇంచార్జ్ మురళీ సుధాకరరావు, అంకం నాగరాజు, కురిచేటి వెంకట సుబ్బారావు (చిన్ని), చామర్తి శ్రీనివాసరావు, బాణాల రవి, యర్రాకుల రామాంజనేయులు, నరేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు షేక్ కాలేషాబాబు విరాట్, సెక్రటరి శిరోమణి పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని స్వర్ణ గ్రామంలో తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఒ నేతాజీ ఆధ్వర్యంలో యోగేంద్రపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో హెూమియో వైద్యులు డాక్టర్ ప్రదీప్, టిడిపి మండల నాయకులు తిరుమల శెట్టిశ్రీ హరి, నాగేశ్వరరావు, ఎస్‌వి వెంకట్రావు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

సిఎం సహాయనిధి పేదలకు వరమని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. తూర్పు నాయుడుపాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల విలువైన సిఎం సహాయనిధి చెక్కులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మఒడికి కోతలు పెట్టి తల్లుల్ని మోసం చేసిన జగన్‌కి తల్లికి వందనంపై మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. సంక్షేమానికి సరికొత్త నిర్వచనం తల్లికి వందనం అన్నారు. నాడు నాసిరకం మద్యంతో జగన్ పేదల నుంచి వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. నేడు తల్లికి వందనం పేరుతో చంద్రబాబు నాయుడు నేడు 67.27 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10వేల కోట్లుజమ చేశారన్నారు. ఇప్పటి వరకు కొండపి నియోజకవర్గంలో రూ.12 కోట్ల విలువైన సీఎం.ఆర్. ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. పాలన అంటే బటన్ నొక్కడం కాదని, భవిష్యత్తు నిర్మాణం అనే విధంగా కూటమి పాలన సాగుతోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, పాలేటిపాడు టిడిపి అధ్యక్షులు మక్కెన శ్రీనివాస్, టీడీపీ ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, పాలేటిపాడు సర్పంచి కె. యోహాను పాల్గొన్నారు.


సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

మళ్లీ ఉద్రిక్త వాతావరణం

పొగాకు రైతుల సమస్యలు తెలుసుకొనేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొదిలికి వచ్చారు. జగన్ పొగాకు వేలం కేంద్రానికి ర్యాలీగా వస్తున్న సమయంలో టిడిపి నేతలు నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన రాళ్ళ దాడిలో పోలీసులు, సామాన్యులు గాయపడ్డారు. ఈఘటనకు సంబంధించి తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇరుపక్షాల నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది.జరిగిన రాళ్ల దాడిని వైసిపి నేతలు ఖండించారు. జగన్ పర్యటన ఖరారైన తర్వాత టిడిపి నేతలు తమ కార్యకర్తలను, ప్రజలను రెచ్చగొట్టే విధంగా నిరసన కార్యక్రమం చేపట్టడం తగదని వైసిపి నేతలు పేర్కొన్నారు. తమ వారిని రెచ్చగొట్టి జగన్ పర్యటన అడ్డుకునే విధంగా టిడిపి నేతలు ప్రవర్తించారని ఆరోపించారు.తాజాగా శనివారం మరో 15 మందిని అరెస్టు చేశారు. అందులో ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు.9 మందిని కోర్టులో హాజరు పరిచారు.పోలీసులు అరెస్టు చేసిన వారితో వైసిపి నాయకులు మాట్లాడేందుకు ప్రతియ్నంచగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా కూటమి నేతలు విజయోత్సవాలకు పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో బోయింగ్ విమానం కూలడంతో అనేక మంది మరణించడంతో ఈ వేడుకలను వాయిదా వేశారు. ప్రతిపక్ష వైసిపి కూటమి ఏడాది పాలనను వెన్నుపోటు దినంగా పిలుపు నిచ్చింది. కూటమి ప్రభుత్వం మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలను అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని నిరసనలు తెలిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న పొగాకు కొనుగోలు సమస్య, ధర లేకపోవడం అధికార టిడిపి నేతలకు తలనొప్పిగా మారింది. పొగాకు కొనేలా కంపెనీలపై ఎంత ఒత్తిడి తెచ్చినా వారు ప్రభుత్వం సూచించిన తగిన ధరతో పొగాకు కొనుగోళ్ళు జరపడం లేదు.ఈ అంశం ప్రతిపక్ష వైసిపి నేతలకు విమర్శనాస్త్రంగా మారింది. ఈ క్రమంలో నల్లబర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పొగాకు నిల్వల కోసం అధికారులు గోడౌన్లను పరిశీలించారు. పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, చీరాల, మద్దిపాడు యార్డుల ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ళు చేపట్టనున్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో ఈనెల 17న నల్లబర్లీ పొగాకు కొనుగోలును అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోడౌన్ల సామర్థ్యం, నిల్వ ప్రక్రియ,సిబ్బంది, హమాలీల నియామకం, ఏజెన్సీల ఖరారు పనులు పూర్తి చేస్తున్నారు. ఆన్‌లైన్ టోకెన్ విధానంలో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కంపెనీల వారు మాత్రం నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ళు వారిచ్చిన హామీ మేరకు జరపడం లేదు.కొన్ని చోట్ల మాత్రమే నాణ్యమైన పొగాకు కొద్దికొద్దిగా కొంటున్నారు.



చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించింది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంప్రదాయ నేత మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మార్కెట్ లో ఇప్పటికే డిమాండ్ ఉంది. కేంద్ర ప్రభుత్వం చీరాల కుప్పడం చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఇవ్వడంతో దీని మార్కెట్ మరింతగా విస్తరించనుంది. జాతీయ స్థాయిలో కొనుగోళ్ళకు అవకాశం లభిస్తుంది. మరింత మంది చేనేత కుటుంబాలకు కుప్పడం చీర ఆసరాగా నిలువనుంది. జాతీయ మార్కెట్ లో కుప్పడం చీరలు ప్రత్యేకతను సంతరించుకోనున్నాయి.

ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాల్సి ఉంది. అన్ని రంగాల్లోను యంత్రాల రాకతో కూలీలకు పనులు ఉండడం లేదు. పనుల కోసం స్వగ్రామాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలసలకు వెళ్ళాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పనులను గుర్తించి ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలి. దీంతో పాటు ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ఉపాధి కూలీలకు వేతనాలు 15 రోజుల లోపల ఇవ్వాల్సి ఉంది. అలా జరగడం లేదు.వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరిగితే ఆ తర్వాత వడ్డీతో కలిపి ఉపాధి కూలీలు వేతనాలు పంపిణీ చేయాలని చట్టం చెబుతోంది. అది కూడా అమలు కావడం లేదు. సమ్మర్ అలవెన్స్, పలుగు, పార, తట్ట, మెడికల్ కిట్, టెంటు ఇవ్వాలని చట్టంలో ఉంది.అవి కూడా అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ చట్టానికి రానురాను తూట్లు పొడుస్తోంది.ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. వేసవి తీవ్రతకు వడదెబ్బ తగిలి కూలీలు ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉంది. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతంలో నీడకు పట్టలు, మంచినీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డగింత

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను ఒంగోలు నగరం లోని గాంధీనగర్ 33వ డివిజన్ కాలనీ వాసులు శనివారం అడ్డుకున్నారు. ఆదాని కంపెనీ కి చెందిన ప్రతినిధి విద్యుత్ సిబ్బందితో కలసి గాంధీనగర్ 3 వ లైన్‌లో గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకుఉపక్రమించారు. ఈ పాటికే తమ నివాసాల్లో ఉన్న మీటర్లు పని చేస్తున్నాయని, ఆ మీటర్లకు డిపాజిట్ రూ.10 వేల చెల్లించి ఏర్పాటు చేసుకున్నామని ఇప్పుడు మార్చడం ఎందుకని వారు ప్రశ్నించారు. కంపెనీ ప్రతినిధులు మీటర్ల ఏర్పాటుకు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా బిగిస్తున్నట్లు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మీటర్లు బాగానే పనిచేస్తున్నప్పుడు ఇంత అర్జెంట్‌గా మీటర్లు మార్చాల్సిన అవసరం ఏముందని స్థానికులు ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న మీటర్లని, వరుస క్రమంలో అందరికీ బిగిస్తున్నాం మీకూ బిగిస్తామని ఒప్పించే ప్రయత్నం చేశారు. ఓ ఇంటికి మీటర్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. తాను మీటర్ మార్చాలని డిపార్టుమాంట్ ను కోరలేదని, నగదు కూడా చెల్లించలేదని కొత్త మీటర్ ఎలా బిగిస్తారని వారు ప్రశ్నించారు. కొత్త మీటర్ ఏర్పాటు చేయవద్దని టెక్నీషియన్స్ ను స్థానికులు అడ్డుకున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, షేక్ పీర్‌సాహెబ్ ,దాసు, గురవయ్య ఘటనా స్థలానికి చేరుకొని స్మార్ట్ మీటర్లు ఎవరు బిగించమన్నారు? కాంట్రాక్టర్ ఎవరు అని ప్రశ్నించడం తో మీటర్లు బిగించేందుకు వచ్చిన వారు అక్కడ నుంచి ఉడాయించారు.


స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తున్న చీకటి శ్రీనివాసరావు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రతిఘటించండి : సిపిఎం

వినియోగదారులకు భారమైన స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రతిఘటించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు గాంధీనగర్ కాలనీ వాసులకు సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడుస్మార్ట్ మీటర్ల ప్రక్రియను వ్యతిరేకించిన టిడిపి అధికారం చేపట్టిన అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఈ పాటికే దుకాణాలకు, వాణిజ్య సముదాయాలకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు ఆయన పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వల్ల వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతారని ఆయన వివరించారు. సర్‌ఛార్జీల పేరుతో ఈ పాటికే భారమైన విద్యుత్ చార్జీలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముందుగానే విద్యుత్ కోసం రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మీటర్ల తయారీ ఖర్చు సైతం వినియోగదారుడు నెలవారీగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. టైమ్ ఆఫ్ చార్జీల పేరుతో పగటిపూట రెట్టింపు ఛార్జీలు వసూలు చేసే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వాసులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవనాలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

జిల్లా కోర్టు భవన సముదాయం బాపట్ల పట్టణంలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. జిల్లా కోర్టు భవన సముదాయానికి అవసరమైన స్థలాన్ని కలెక్టర్ శనివారం పరిశీలించారు. తూర్పు బాపట్లలో ఖాళీగా ఉన్న 7.5 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం ఇందిరానగర్‌లో ఖాళీగా ఉన్న 2.80 ఎకరాల భూమిని పరిశీలించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భూమి స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత దస్త్రాలను పంపాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట బాపట్ల తహశీల్దారు సలీమా, సర్వేయర్లు, విఆర్ఒలు తదితరులు ఉన్నారు.


స్థలాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి